క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన అచ్యుత రామారావు



రాజ్యసభ ఎంపీగా ఎంపికైన సుబ్బారెడ్డిని కలిసిన వగ్వాల అచ్యుత రామారావు

భీమడోలు: రాజ్యసభ ఎంపీగా ఎంపికైన వైవీ సుబ్బారెడ్డిని సోమవారం తాడేపల్లిలో రాష్ట్ర, జిల్లా కాపు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత, జిల్లా కాపు నాయకులు వగ్వాల అచ్యుత రామారావు సుబ్బారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. తనతో పాటు కొవ్వూరు శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ తదితరులు కలిశామని వగ్వాల అచ్యుతరామారావు తెలిపారు. వైఎస్సార్ సీపీ గెలుపుకు నాయకులంతా వెన్నుదన్నుగా నిలవాలని, గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారని, పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారని వాగ్వాల తెలిపారు.

బిషప్ జయరావుకు సత్కారం



ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావును సత్కరిస్తున్న అమ్మన్‌రాజా, ఇస్రాయేలు

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావును సోమవారం దెందులూరు పారిస్ క్రైస్ట్ ఫాదర్ అమ్మన్‌రాజా దెందులూరు గ్రామానికి చెందిన ఆర్‌సీఎం సంఘ సభ్యులు గుంపుల ఇస్రాయేలు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు విశాఖపట్టణం ఆర్‌సీఎం అగ్రపీఠానికి పరిపాలనాధికారిగా నియమిస్తూ పోప్ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేయడంతో ఆర్‌సీఎం తరపున తమకు ఎంతో సంతోషంగా గర్వకారణంగా ఉందన్నారు. ఏలూరు పీఠం మాదిరిగానే విశాఖపట్టణం కూడా ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని పారిస్ క్రైస్ట్ అమ్మన్‌రాజా, ఇస్రాయేలు ఆకాంక్షించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం



కొవ్వలిలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ వి.జితేంద్ర

దెందులూరు: మండలంలో ఇప్పటి వరకు 17 గ్రామ పంచాయతీల్లో 72 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని తహసీల్దార్ వీ.జితేంద్ర అన్నారు. సోమవారం కొవ్వలి సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని దీనికి వీఆర్‌ఓలు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రామకృష్ణ, కిషోర్, వీఆర్ఏలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చేబ్రోలు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సుభాష్, ఎస్సై మణికుమార్

ఉంగుటూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సీఐ సుభాష్, చేబ్రోలు ఎస్సై మణికుమార్ సోమవారం పరిశీలించారు. ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం, నారాయణపురంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై 21న విచారణ

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో కోటి రూపాయల నిధుల దుర్వినియోగంపై రెండవసారి విచారణకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ కార్యాలయంలో ఈ నెల 21న దెందులూరు గ్రామ పంచాయతీకి సంబంధించి అన్ని రికార్డులు, రశీదులు తీసుకురావాలని పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు. గతంలో నిధులు దుర్వినియోగంపై గ్రామానికి చెందిన చిలికి శేఖర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ విచారణ చేసి కోటి రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగమయ్యాయని గుర్తించి నివేదికను డీపీఓ ద్వారా కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ ఇటీవల దెందులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ తోట ఏసమ్మ చెక్ పవర్‌ను రద్దు చేశారు. అనంతరం రెండవసారి విచారణ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి

- సీఎం జగన్ పాలనకు జనం జేజేలు
- అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత
- జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే వాసుబాబు



కేశవరంలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే వాసుబాబు



అర్ధవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందంజలో ఉందని, అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్ధవరం, కేశవరం, కొందేపాడు, అప్పనపేట తదితర గ్రామాల్లో నిర్వహించిన సభలలో వారు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అర్ధవరంలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద ప్రజలకు అండగా అమలు చేసిన సంక్షేమ పథకాలు వారి కుటుంబ పరిస్థితులను, జీవన ప్రమాణాలను మెరుగుపరచిందని, ప్రతి మహిళా స్వయం సమృద్ధి సాధించారని అన్నారు. కళ్లున్న కబోదుల్లా మారిన పచ్చ నేతలు, ఎల్లో మీడియాలకు మాత్రం రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, ఆర్‌బీకే కేంద్రాలు, ఆరోగ్య కేంద్ర భవనాలు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వంతెనల నిర్మాణం వంటివి అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. కేశవరంలో ఫిష్ ఆంధ్ర కేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాజకీయంగా మహిళలు, బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వైఎస్ జగన్‌కు ఆ వర్గాలలకు అండగా ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వమూ బీసీలకు, మహిళలకు ఇన్ని పదవులు ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య జరిగే యుద్ధమని ఈ పోరులో పేదలంతా జగనన్న వైపు నిలబడాలని ఆమె కోరారు. జగన్ పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని అన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అనంతరం ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ , ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొన్నారు. గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. అప్పనపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మల్లపరాజుపేటలో రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. కేశవరంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్‌ను ప్రారంభించారు. కొందేపాడులో రూ.47 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.60 లక్షలతో ఉండి పంట కాల్వ నుంచి మంచి నీటి చెరువుకు నీరునింపేందుకు పంప్ హౌస్ పథకాలకు ప్రారంభోత్సవం చేశారు. మొయ్యేరులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మొయ్యేరు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు గాతల సుజాత, నూకారపు సుధాకర్, శీతాలం వీరలక్ష్మి, పుల్లయ్యనాయుడు, బాతు నాగేశ్వరరావు, మల్లంపల్లి సరేష్ , మిడతాని కామేశ్వరి, దుళ్ల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు అల్లాడి రమేష్, కొల్లి సత్యనారాయణ, దండు విజయదుర్గనందిని, సొసైటీ అధ్యక్షుడు దండు మురళి, ఈదర అశోక్, పార్టీ నాయకులు మారిశెట్టి అబ్బులు, వగ్రే సత్యనారాయణ, నక్కానూరి బంగారయ్య, పాల్గొన్నారు.

25న విశ్వబ్రాహ్మణులకు కీర్తి పురస్కారాల ప్రదానం



సమావేశమైన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

ఉంగుటూరు: విశ్వబ్రాహ్మణులు ఐక్యతగా ఉండాలని సంఘం ఉంగుటూరు మండల అధ్యక్షుడు అనుపోజు బ్రహ్మం అన్నారు. సోమవారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో విశ్వబ్రాహ్మణుల సంఘ సమావేశం బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ఈనెల 25న ఏలూరులో నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణులకు కీర్తి పురస్కారాల ప్రదానం సభకు తరలి రావాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు యర్రోజు సుబ్బయ్యచార్యులు, ప్రధాన కార్యదర్శి నల్లూరి రాంపండు, కోశాధికారి వి. సత్యనారాయణ, నిడదవోలు శ్యామ్ పాల్గొన్నారు.

21న గోపన్నపాలెంలో నియోజకవర్గ స్పోర్ట్స్ సమావేశం

దెందులూరు: గోపన్నపాలెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న ఉదయం 8.30 గంటలకు దెందులూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు స్పోర్ట్స్ కాంప్లెక్స్ కార్యదర్శి ఎల్‌వీడీ రవిబాబు తెలిపారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ మరీదు మనోహర్ అధ్యక్షతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తామని, ప్రతి వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా స్పోర్ట్స్ యూనిఫామ్‌తో హాజరుకావాలని రవిబాబు వివరించారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలి



గణపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, బూత్ కన్వీనర్లు

గణపవరం: రానున్న రెండు నెలల కాలం ఎంతో విలువైనదని, ఈ సమయంలో నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి క్షణాన్ని వినియోగిస్తూ కృషి చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం కేవీపీ కల్యాణ మండపంలో గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల సన్నద్ధతపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేసిన పథకాలే విజయానికి పునాదులని, ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి మద్దతు కోరాలని సూచించారు. బూత్ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఓటరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీలు, పార్టీ అనుబంధ సంఘాలు సమన్వయంతో ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేసుకుని, ప్రణాళికా బద్ధంగా పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కాలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వంపై నిరంతరం విషం చిమ్ముతున్న పచ్చమీడియా దురాగతాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులు చేయాలని దిశా నిర్దేశం చేశారు. గణపవరం, నిడమర్రు ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీలు కోడే కాశి, దేవారపు సోమలక్ష్మి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, మండల సచివాలయ కన్వీనర్లు ఎంఆర్‌కే, నౌడే అచ్యుతరావు, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, పార్టీ నాయకులు మహ్మద్ జానీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

ఈ సందర్భంగా నిడమర్రు మండలం అడవికొలనుకి చెందిన పలువురు నాయకులు టీడీపీ, జనసేన పార్టీల నుంచి వాసుబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వాసుబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఘనంగా రామలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠ పూజలు



అంబర్‌పేట శివాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భీమడోలు: అంబర్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయ రాజు చొరవతో కామన్ గుడ్ ఫండ్ నిధులు రూ.30 లక్షలతో ఆలయాన్ని పునఃనిర్మించి సకల వసతులను సమకూర్చి సుందరంగా తీర్చిదిద్దారు. బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ప్రతిష్ఠ పూజలు కొనసాగనున్నాయి. అర్చక స్వాములు మేడూరి ఏడుకొండలు, మేడూరి శ్రీనివాసరావు నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం యాగశాల ప్రదక్షణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మండపారాధన, యంత్ర, విగ్రహ, మార్జనలు, దీక్షాధారణ, త్రిశూల పూజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి అంకురారోహణ, ప్రధాన కలశారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హోమాలు వైభవంగా సాగాయి. శివపార్వతులు, గణపతి, నాగబంధ, ఆంజనేయస్వామి, నందీశ్వర చండీశ్వర విగ్రహాలను ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి భానుదీపిక, ఈవో ఎం.రాధ, ఎంపీటీసీలు ఆజామ్, విజయభాను, ఏపూరి రాంబాబు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోటల్‌పై విజిలెన్స్ దాడి

భీమడోలు: గృహ అవసరాలకు కేటాయించిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న ఓ హోటల్‌పై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. భీమడోలులో నిబంధనలకు విరుద్ధంగా దుకాణంలో వాడుతున్న రూ.9,588 విలువ గల నాలుగు గ్యాస్ సిలిండర్లను వారు స్వాధీనం చేసుకుని, హోటల్ యాజమానిపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, సీఎస్ డీటీ ఎ.మాధవరావు సంయుక్తంగా భీమడోలులోని హోటల్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. యాజమానిపై నిత్యావసరాల చట్టం ప్రకారం 6ఏ, 7(1) కేసులను నమోదు చేశారు. ఈ దాడిలో వీఆర్వో సాల్మన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

గణపవరం: గణపవరం మండల వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమి త్తం ఈనెల 21, 22 తేదీల్లో గణపవరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా ఆలయ ఆవరణలో వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెదవేగి : పెదవేగి మండలం బాపిరాజుగూడెంలోని షిరిడి సాయినాథుని దశమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐదురోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం ఐదు గంటలకు సాయినాథునికి, ఇతర దేవతా మూర్తులకు పంచామృత అభిషేకాలు, 108 కలశాలతో కూడిన వివిధ నదీ జలాలు, 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకాలు చేశారు. వివిధ రకాల పండ్లు, మధుర పదార్థాలు నైవేద్యంగా సమర్పించి సాయినాథునికి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ చేసి, శ్రీవల్లీ దేవసేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠ చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన, అనంతరం సాయినాథుని గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

పెదవేగి : పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరచారని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు అందింది. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన లంకపల్లి అశోక్ రెండు రోజుల క్రితం కూరగాయాలు అమ్ముకుంటూ మోటారు సైకిల్‌పై వెళుతుండగా, అదే సమయంలో కాటం రంగారావు, మరో వ్యక్తి కలిసి పాత కక్షల నేపథ్యంలో అశోక్‌పై దాడి చేసి, గాయపరిచారని తెలిపారు. ఈ ఘటనపై సోమవారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు గొల్లగూడెంలో వైద్య శిబిరం

ఉంగుటూరు: నేడు గొల్లగూడెం శివాలయం వద్ద వెన్నెముక సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సర్పంచి కరపా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో నడుం నొప్పి, మెడనొప్పి, చేతు, కాళ్ల తిమ్మిర్లు, మొద్దు బారటం, డిస్కు సమస్యలు, స్పాండిలైటిస్, జారిన వెన్నెముక తదితర ఎముకుల సమస్యలున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం వేద స్పైన్ సెంటర్ డా. తేజోఫణీంద్ర (వెన్నెముక నిపుణులు) సేవలు అందిస్తారని శ్రీనివాసరావు వివరించారు. ఈ శిబిరాన్ని గొల్లగూడెం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కోరారు.

నేడు వలంటీర్లకు వందనం

గణపవరం: ఈనెల 20వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొని గణపవరం మండలంలోని వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వాసుబాబు చేతల మీదుగా వలంటీర్లకు అవార్డులు అందజేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు భీమడోలు వీసీ కన్వెన్షన్ హాలులో నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వాసుబాబు పాల్గొని భీమడోలు మండలంలోని వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావును సత్కరించిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు

పెదపాడు: మండలంలోని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలను అమలు చేసేందుకు జారీ చేసిన జీవో-11ను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు వినయ్, రాజేష్, పార్వతి, ఉమా భరత్, ఇతర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు



గాలాయగూడెంలో ప్రత్యేక అలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ



భక్తుల కోసం నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారిని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల కోసం గ్రామానికి చెందిన దాత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు నూతన కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు.



ఆలయ కమిటీతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై

పకడ్బందీగా ఉత్సవాలకు బందోబస్తు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు రెండు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాఖాపరంగా పటిష్ఠమైన చర్యలు తీసుకున్నట్టు పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాస్ అన్నారు. సోమవారం అమ్మవారి ఉత్సవాల్లో ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దెందులూరు ఎస్సై కే. స్వామి, ఆలయ కమిటీ సభ్యులు సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, అంబటి లక్ష్మణరావు, తోట వెంకన్న, పూజారి రాంబాబు తదితరులతో మాట్లాడా రు. పలు సూచనలుచేశారు. భక్తులు వెళ్లడానికి ఆలయంనుంచి బయటకు రావడానికి మూడు మార్గా లు, వాహనాల పార్కింగ్, తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రం, విద్యుత్, అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా ఆలయ కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ సిబ్బందితో అమ్మవారు ఉత్సవాల్లో ఔట్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కమిటీ, పోలీసుల సమన్వయంతో భక్తులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలన్నారు. ఎటువంటి అసౌకర్యం కలిగినా దెందులూరు ఎస్సై, తనకు సమాచారం ఇవ్వాలని ఆలయ కమిటీకి సూచించారు.